

టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.2°/21.5°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా అంతటా వర్షం

- 300.6 మి.మీ వర్షపాతం నమోదు



వెంకటగారిపల్లి వద్ద కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్‌: తుపాను ప్రభావంతో జిల్లాలో వరుసగా రెండో రోజూ వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 300.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అమరాపురం మండలంలో 40.8 మి.మీ, కదిరిలో 40 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక నల్లమాడ మండలంలో 36.8 మి.మీ, గుడిబండ 27.8, మడకశిర 25.2, నల్లచెరువు 15.8, ధర్మవరం 13.4, కనగానపల్లి 10.2, ఎన్‌పీకుంట 9.0, బుక్కపట్నం 7.6, తలుపుల 7.4, హిందూపురం 6.8, ముదిగుబ్బ 6.4, రొళ్ల 6.4, ఓడీచెరువు 6.4, గాండ్లపెంట 6.2, తనకల్లు 6.0, అగళి 5.2, కొత్తచెరువు 4.2, పుట్టపర్తి 3.8, లేపాక్షి 3.4, రొద్దం 2.2, చిలమత్తూరు 2.2, రామగిరి 2.0, పరిగి 2.0, బత్తలపల్లి మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. కాగా, మరో రెండురోజులూ జిల్లాలో అక్కడక్కడా జల్లులు నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

పరిష్కార వేదికకు 260 వినతులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై 260 వినతులు అందాయి. కలెక్టర్‌ చేతన్‌ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని ఆయాశాఖలకు పంపారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై అర్జీల పరిష్కారంపై దిశానిర్దేశం చేశారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో కల్పించిన సౌకర్యాలను తెలుపుతూ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌, డీఆర్‌ఓ విజయ సారథి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయండి: జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌

ప్రశాంతి నిలయం: జిల్లాలోని 32 గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌ ఆదేశించారు. నెలాఖరులోగా డీఎల్‌ఆర్‌ పూర్తి చేయాలన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌ హాలు నుంచి మున్సిపల్‌ కమిషనర్లు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. రెవెన్యూ అంశాలతో పాటు రీసర్వేపై సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యను తెలుసుకొని పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ సూర్యనారాయణరెడ్డి, సర్వే, ల్యాండ్‌ ఏడీ విజయశాంతి బాయి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వసతి గృహాల్లో (2025–26 విద్యా సంవత్సరానికి) ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సహాయ సంచాలకులు అర్చన సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. 3వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తుకు అర్హులన్నారు. బాలురకు అనంతపురంలోని హెచ్‌ఎల్‌సీ కాలనీలో, బాలికలకు అనంతపురం అరవింద నగర్‌లో వసతి గృహాలు ఏర్పాటు చేశామన్నారు. వసతి గ్రహంలో చేరే వారికి ఉచిత భోజన, వసతితో పాటు దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్‌ పెట్టె, ప్లేట్లు, గ్లాసులు, కాస్మోటిక్స్‌ అందిస్తామన్నారు.

‘సీజనల్‌’ బారులు

రోగులతో కిక్కిరిసిన జిల్లా ఆస్పత్రి



ఓపీ చీటీల కోసం బారులు తీరిన పురుషులు



ఓపీ చీటీల కోసం గుమిగూడిన మహిళలు

హిందూపురం టౌన్‌: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించింది. దోమలు విపరీతంగా పెరగడంతో సీజనల్‌ వ్యాధులు విరుచుకుపడ్డాయి. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు. వారంతా చికిత్స కోసం హిందూపురంలోని జిల్లా ఆస్పత్రికి వస్తున్నారు. ఫలితంగా సోమవారం ఓపీ 1000 దాటిపోయింది. ఓపీ చీటీల కోసం జ్వరపీడితులంతా ఆస్పత్రి ఎదుట బారులు తీరారు. చిన్నారుల ఓపీ కూడా కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఓపీకి వచ్చే వారి సంఖ్య తగ్గలేదు. జ్వరపీడితులు భారీగా పెరగడంతో పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైద్యం పొందడానికి గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు.



చిన్న పిల్లల ఓపీ వద్ద కిక్కిరిసిన దృశ్యం



వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బారులు తీరిన గర్భిణులు

బీమా.. రైతుకేదీ ధీమా..!

☛ ముదిగుబ్బ మండలం మర్తాడు గ్రామ రైతు నారాయణరెడ్డి రెండేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో పండించిన వేరుశనగ పంట అతివృష్టితో పూర్తిగా తడిసిపోయింది. అప్పట్లో జగన్‌ ప్రభుత్వం ‘వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా’ అమలు చేసినందు వల్ల నారాయణరెడ్డి రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండానే బీమా అందుకున్నాడు. కానీ కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాను ఎత్తేయడంతో ప్రీమియం చెల్లించలేక ఇలాంటి రైతులు జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది బీమాకు దూరమవుతున్నారు. దీంతో ప్రీమియం చెల్లించని రైతులు పంటలు నష్టపోయినా వారికి రూపాయి కూడా పరిహారం అందే అవకాశం లేదు.

- గత ప్రభుత్వంలో విజయవంతంగా ఉచిత పంటల బీమా అమలు
- గతంలో ప్రభుత్వమే ప్రీమియం డబ్బులు చెల్లింపు
- అప్పట్లో 2,96,541 మంది రైతులకు రూ.718 కోట్ల లబ్ధి
- కూటమి ప్రభుత్వంలో ఉచిత పంటల బీమాకు మంగళం
- సర్కారు నిర్ణయంతో బీమాకు దూరం కానున్న రైతులు



కదిరి: అన్నదాతలపై పైసా భారం పడకుండా గత వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన ‘వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా’కు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఈ పథకం స్థానంలో 2019కి పూర్వం ఉన్న ప్రధానమంత్రి ఫసల్‌ బీమా యోజనతో పాటు వాతావరణ ఆధారిత బీమాను తీసుకొచ్చింది. ఈ బీమా కింద లబ్ధి పొందాలంటే రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

భారమైన ప్రీమియం..

ప్రధానమంత్రి ఫసల్‌ బీమా కింద కంది, జొన్న, వరి తదితర పంటలను తీసుకువచ్చారు. వాతావరణ ఆధారిత బీమా పరిధిలో వేరుశనగ, అరటి వంటి పంటలను చేర్చారు. వరి పంటను గ్రామం యూనిట్‌గా, వేరుశనగను మండలం యూనిట్‌గా, కంది, జొన్న పంటలను జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారు. జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీతో గడువు ముగిసింది. వరి, మొక్కజొన్న వంటి పంటలకు ఇంకా ప్రీమియం గడువు ఉంది. వేరుశనగ ప్రీమియం చెల్లించకపోతే పంట రుణాలను రెన్యూవల్‌ చేసేది లేదని బ్యాంకర్లు తేల్చి చెప్పడంతో బ్యాంకుల్లో క్రాప్‌లోన్‌ తీసుకున్న రైతులు మాత్రం అయిష్టంగానే ప్రీమియం డబ్బులు చెల్లించారు. ప్రభుత్వం నుంచి ఏ మాత్రం ఆర్థిక సాయం అందక పంటల సాగుకు పెట్టుబడులు కూడా ఇబ్బంది పడుతున్న తరుణంలో బీమా ప్రీమియం రైతులకు మరింత భారమైంది. ఈ నేపథ్యంలోనే కంది, అలసంద, పెసరు లాంటి ఇతర పంటలకు ప్రీమియం చెల్లించేందుకు రైతులెవ్వరూ ముందుకు రాలేదు.

ఉచిత పంటల బీమాతో గత ప్రభుత్వంలో జిల్లాలో లబ్ధి ఇలా:

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి(రూ.కోట్లలో)
2019-20	2,96,541	193.89
2020-21	1,28,100	115.57
2021-22	1,72,062	255.78
2022-23	1,77,300	153.33
మొత్తం	2,96,541	718.57

జగన్‌ హయాంలో ఎందరికో లబ్ధి..

గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్‌ ఉచిత పంటల బీమాతో జిల్లా రైతులకు ఎంతో లబ్ధి చేకూరింది. ఈ పథకం ద్వారా కదిరి నియోజకవర్గంలో 55,755 మంది రైతులకు రూ.107.53 కోట్లు లబ్ధి పొందారు. ధర్మవరం నియోజకవర్గంలో 47,870 మంది రైతులకు రూ.191.48 కోట్లు, పుట్టపర్తిలో 67,045 మందికి రూ.78.8 కోట్లు, హిందూపురంలో 17,415 మంది రైతులకు రూ.36.22 కోట్లు, మడకశిర నియోజకవర్గంలో 38,198 మంది రైతులకు రూ.79.29 కోట్లు, పెనుకొండలో 24,276 మంది రైతులకు రూ.99.29 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలోని జిల్లా పరిధిలో ఉన్న మండలాలకు చెందిన 60,118 మంది రైతులకు రూ125.96 కోట్ల లబ్ధి చేకూరింది. ఇలా జిల్లా వ్యాప్తంగా అప్పట్లో మొత్తం 2,96,541 మంది రైతన్నలకు వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా ద్వారా రూ.718.57 కోట్ల లబ్ధి కలిగింది.

దేశంలోనే ది బెస్ట్‌ క్రాప్‌ ఇన్సూరెన్స్‌..

వైఎస్‌ జగన్‌ సర్కార్‌ ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన ‘వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా’ పథకం దేశంలోనే ది బెస్ట్‌ క్రాప్‌ ఇన్సూరెన్స్‌ అని గతంలో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇన్నోవేషన్‌ కేటగిరి కింద జగన్‌ ప్రభుత్వానికి 2023లో అవార్డు కూడా ఇచ్చింది. అప్పట్లో ఏపీ స్ఫూర్తితో నోటిపై చేసిన పంటలకు యూనివర్సల్‌ కవరేజ్‌ కల్పించేందుకు ఫసల్‌ బీమాలో కూడా కొన్ని మార్పులు చేసింది. ఈ–క్రాప్‌ నమోదు ప్రామాణికంగా రైతు సాగు చేసిన ప్రతి పంటకూ యూనివర్సల్‌ కవరేజ్‌ కల్పిస్తూ రైతులకు పైసా భారం పడకుండా జగన్‌ సర్కారు 2019 రబీ నుంచి ఉచిత పంటల బీమాను విజయవంతంగా అమలు చేస్తూ వచ్చింది. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఇలాంటి మంచి పథకానికి చంద్రబాబు సర్కారు మంగళంపాడటంతో రైతులు ఎంతో నష్టపోతున్నారు.

రైతులను ముంచే ప్రభుత్వమిది



వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా ఉంది. రైతు భరోసా కింద ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. కానీ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటి దాకా రూపాయి కూడా ఇవ్వకపోగా ఉచిత పంటల బీమాను కూడా ఎత్తేసింది. రైతులు ప్రీమియం చెల్లిస్తే గానీ ఇప్పుడు బీమా అమలు కాదు. కూటమి సర్కారు నిర్ణయాలతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. జగనన్నది రైతు సంక్షేమ ప్రభుత్వమైతే... చంద్రబాబుది రైతులను ముంచే ప్రభుత్వం. – ఉషశ్రీ చరణ్‌, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌ సీపీ

రైతులపై ప్రీమియం భారం వద్దు



రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే గత ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా వర్తించేది. కానీ ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. పెట్టుబడులకే అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లో బీమా ప్రీమియం మరింత భారంగా మారింది. బీమాపై కూటమి ప్రభుత్వం పునరాలోచించుకోవాలి. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తే మంచిది.
– రాంభూపాల్‌, జిల్లా కోఆర్డినేటర్‌, సీపీఎం

ఉచిత బీమా మేలు



గత ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత పంటల బీమానే చాలా బాగుంది. పంట నష్టపోతే బీమా వచ్చేది. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేయడం సరైన నిర్ణయం కాదు. రైతులకు ఎలాంటి భారం లేకుండానే గత ప్రభుత్వంలో బీమా ఇచ్చారు. పెట్టుబడి సాయం కూడా ఇచ్చారు. ఈ ప్రభుత్వం ఇంత వరకూ రైతులకు ఎలాంటి సాయం అందించలేదు.
– వేమయ్య యాదవ్‌, జిల్లా కార్యదర్శి, సీపీఐ

ప్రీమియం డబ్బు రైతే చెల్లించాలి



2025–26కు గాను వాతావరణ ఆధారిత పంటల బీమాకు సంబంధించి వేరుశనగ పంటకు ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీతో గడువు ముగిసింది. ఫసల్‌బీమాకు సంబంధించి కంది, మినప, జొన్న పంటలకు ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. వరి పంటకు మాత్రం ఆగస్టు 15వ తేదీ వరకూ ప్రీమియం చెల్లించవచ్చు. ప్రీమియం చెల్లించిన రైతులకే బీమా వర్తిస్తుంది.
– వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

వైఎస్సార్‌ సీపీ ఉమ్మడి జిల్లా రీజనల్‌ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్‌: వైఎస్సార్‌ సీపీ ఉమ్మడి జిల్లా రీజనల్‌ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశాల మేరకు ఈ మేరకు కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించడంతో పార్టీ రీజనల్‌ కో ఆర్డినేటర్‌ పీవీ మిథున్‌ రెడ్డి అందుబాటులో లేరు. ఆయన అందుబాటులోకి వచ్చే వరకు డాక్టర్‌ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి జిల్లా రీజనల్‌ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎంపీడీఓల సంఘం డిమాండ్‌
- కలెక్టరేట్‌ ఎదుట నిరసన కార్యక్రమం



కలెక్టర్‌ చేతన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్‌: అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుపై నోరు పారేసుకున్న తాడిపత్రి మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎంపీడీఓల సంఘం, డిప్యూటీ ఎంపీడీఓల సంఘం నేతలు డిమాండ్‌ చేశారు. ఇటీవల అనంతపురం జెడ్పీ కార్యాలయానికి వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డి తన స్థాయి మరచి డీపీఓ నాగరాజునాయుడిని దుర్భాషలాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. జేసీ వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు కలెక్టరేట్‌కు విచ్చేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీడీఓలు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీ రాజ్‌ శాఖ కీలకంగా పని చేస్తుందన్నారు. అంతటి కీలకమైన శాఖకు జిల్లా అధికారిగా ఉన్న నాగరాజునాయుడిని జేసీ ప్రభాకర్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం అవసరమన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి అత్యంత దురుసుగా వ్యవహరించిన తీరు, వాడిన పరుష పదజాలంతో ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ చేతన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

హోం మంత్రికి దళితుల పట్ల బాధ్యత లేదా?

- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌



సాక్షి పుట్టపర్తి: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు దళితుల పట్ల బాధ్యత లేదా అని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్‌ ప్రశ్నించారు. సోమవారం మడకశిర నియోజక వర్గంలో పర్యటించిన హోంమంత్రి అనిత రాప్తాడు నియోజకవర్గంలో అత్యాచారానికి గురై బిడ్డకు జన్మనిచ్చి దిక్కుతోచని స్థితిలో ఉన్న దళిత మైనర్‌ బాలికను పరామర్శించక పోవడం బాధాకరమన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన హోం మంత్రి అనితకు దళిత మహిళల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. కూటమి నేతలు వైఎస్సార్‌ సీపీ నాయకుల అక్రమ అరెస్టులపై చూపించే శ్రద్ధ, ప్రజా సమస్యల పరిష్కారంపై చూపడం లేదన్నారు. హోంమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలోని పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులను హౌస్‌ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్‌ పాలన సాగుతోందనేందుకు ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమన్నారు. కూటమి సర్కార్‌ నిరంకుశ పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో సరైన విధంగా సమాధానం చెబుతారన్నారు.

నిందలు.. నిష్ఠూరాలు

- ‘తొలి అడుగు’లో హోంమంత్రి అనిత తీరిది
- ఆద్యంతం వైఎస్సార్‌సీపీపై విమర్శలకే ప్రాధాన్యం
- ఏడాది పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని వైనం

మడకశిర: హోం మంత్రి వంగలపూడి అనిత ‘తొలి అడుగు’ కార్యక్రమం నిందలు.. నిష్ఠూరాలతో సాగింది. సోమవారం ఆమె మడకశిర నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఎక్కడికి వెళ్లినా...ఏ కార్యక్రమంలో పాల్గొన్నా వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలను విమర్శించడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపినా... ఒక్కరంటే ఒక్కరి సమస్య కూడా వినలేదు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో ప్రజలకు ఏం చేసిందో చెప్పేందుకు పట్టణంలోని వైఎస్సార్‌ సర్కిల్‌లో ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజు అధ్యక్షతన జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు సభలో మాట్లాడిన హోంమంత్రి అనిత... ఏడాది పాలనలో ఏం చేసారో చెప్పడం పక్కన పెట్టి.. వైఎస్సార్‌సీపీ పాలనపై నిందలు వేస్తూ నిష్ఠూరమాడారు. దీంతో ప్రజలు విస్మయం చెందారు. ఏడాది పాలనలో కూటమి సర్కార్‌ మడకశిరకు ఏం చేయలేకపోయిందని, అందుకే చెప్పేందుకు ఏం లేక హోంమంత్రి ఇలా విమర్శలతో డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేశారని జనం చర్చించుకున్నారు. సూపర్‌ సిక్స్‌ పథకాలు అమలు చేయకుండా జగన్‌పై విమర్శలు చేస్తే ఏం లాభమని వ్యాఖ్యానించారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పడంతో సభలో ఉన్న వారు ఏడుగుర్రాలపల్లిలో మైనర్‌ బాలికపై జరిగిన అత్యాచార ఘటనను గుర్తు చేసుకుని ఇదేనా మహిళా సంక్షేమం అంటూ చర్చించుకున్నారు. మరో మంత్రి సవిత కూడా మడకశిర ఎమ్మెల్యేను పొగడ్తలతో ముంచెత్తి మడకశిర అభివృద్ధి గురించి మాట్లాడకుండా వెళ్లి పోవడంతో స్థానికులు అసహనానికి లోనయ్యారు. అంతకుముందు హోంమంత్రి అనిత బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితతో కలిసి ఇండియన్‌ డిజైన్స్‌ గార్మెంట్స్‌ పరిశ్రమను సందర్శించారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. మడకశిర అప్‌గ్రేడ్‌ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కాగా, హోంమంత్రి అనిత పర్యటనలో జిల్లాలోని మిగతా నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీ పార్థసారథి కూడా పార్లమెంట్‌ సమావేశాల పేరుతో గైర్హాజరు కావడం విశేషం.



సభలో ప్రసంగిస్తున్న హోం మంత్రి అనిత

కూటమి ప్రభుత్వ తీరు దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప



ఈరలక్కప్పను హౌస్‌ అరెస్టు చేసిన దృశ్యం

గుడిబండ: ప్రతిపక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టు చేయించి వారి గొంతునొక్కేందుకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వ తీరు దుర్మార్గంగా ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం మడకశిర నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో పోలీసులు ఈరలక్కప్పను హౌస్‌ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 నెలల పాలనలో కూటమి సర్కార్‌ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఓ దళిత మైనర్‌ బాలికపై అత్యాచారం జరిగితే రాష్ట్రం యావత్తూ కన్నీరుపెట్టుకుందన్నారు. కానీ ఆ మాత్రం జాలి కూడా కూటమి నేతలకు లేకపోయిందన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన హోంమంత్రి జిల్లా పర్యటనకు వచ్చినా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు ఆపాలని కోరుతూ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం ఇద్దామని మడకశిరకు బయలుదేరిన తనను పోలీసులు గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటన్నారు. కూటమి నాయకుల కుట్రలు, కుతంత్రాలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరన్నారు. వైఎస్సార్‌ సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమేనని, ప్రజలకోసం ఎంతకైనా పోరాడుతుందన్నారు.

బదిలీ టీచర్లకు వేతన కష్టాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,200 మంది ఉపాధ్యాయుల్లో పదోన్నతి దక్కిన ఆనందం ఆవిరైపోయింది. బదిలీపై కొత్త ప్రాంతానికి వెళ్లిన వారు జీతాలు అందక నానా అగచాట్లు పడుతున్నారు. కీలకమైన జూన్ మాసంలో పిల్లల ఫీజులు, బ్యాంకు లోన్లు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. మరో పది రోజుల్లో జూలై మాసం కూడా ముగియనున్న తరుణంలో రెండు నెలల జీతాలు ఆగస్టులో ప్రభుత్వం చెల్లిస్తుందో.. లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- పదోన్నతులు, బదిలీల టీచర్లకు పొజిషన్ ఐడీలు రాక అందని జీతాలు
- ఇబ్బందుల్లో ఉమ్మడి జిలాలోని 2,200 మంది ఉపాధ్యాయులు
- పిల్లల ఫీజులు, బ్యాంకు లోన్ల కంతులకు అగచాట్లు



పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు (ఫైల్)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు	
గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు	133 మంది
పీఎస్‌హెచ్‌ఎంలు	193 మంది
స్కూల్ అసిస్టెంట్లు	3,478 మంది
ఎస్జీటీలు	3,208 మంది
పండిట్లు	111 మంది
పీఈటీలు	29 మంది

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'ఉపాధ్యాయ బదిలీ చట్టం' ద్వారా ఇటీవల పలువురు టీచర్లకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. వీరిలో వేలాది మందికి పొజిషన్ ఐడీలు రాక జూన్ నెల జీతం ఇప్పటి వరకూ అందలేదు. మరో వారం గడిస్తే రెన్నెళ్ల జీతం అందాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,152 మంది టీచర్లు బదిలీ అయ్యారు. వీరిలో గ్రేడ్–2 హెచ్‌ఎంలు 133 మంది, పీఎస్‌హెచ్‌ఎంలు 193 మంది, స్కూల్ అసిస్టెంట్లు 3,478 మంది, ఎస్జీటీలు 3,208 మంది, పండిట్లు 111 మంది, పీఈటీలు 29 మంది ఉన్నారు. సాధారణంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓలకు సమాచారం అందిస్తారు. గతంలో రెగ్యులర్ జీతాలు తీసుకుంటున్నా...వీరి స్థానం మారడంతో బదిలీ అయిన స్థానానికి పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే సీఎఫ్‌ఎంఎస్‌లో వారి వివరాలు కనిపిస్తాయి. అప్పుడు జీతాలు చెల్లించడానికి వీలుంటుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జీతాల కోసం ఎదురు చూస్తున్న 5 రకాల పాఠశాలల టీచర్లు..

కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పది రకాల పాఠశాలల్లో 5 రకాల పాఠశాలల ఉపాధ్యాయులు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కేడర్ల టీచర్లు దాదాపు 2,200 మందికి జూన్ నెల వేతనాలు జమ కాలేదు. అప్‌గ్రేడ్ అయిన ప్రాథమికోన్నత పాఠశాలలు, కొత్తగా ఏర్పాటైన మోడల్ ప్రైమరీ పాఠశాలలు, కొత్తగా పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్–2 హెచ్‌ఎంలకు జీతాలు రాలేదు. వీరందరికీ పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. ముఖ్యంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను కేటాయించారు. వాస్తవానికి ఆ పాఠశాలల్లో గతంలో కేడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా ఉన్న పోస్టులకు జీతాలు చేసే వీలుంటుంది. కొత్తగా వచ్చిన పోస్టులకు పొజిషన్ ఐడీలు కేటాయించిన తర్వాతనే జీతాలకు అవకాశం ఉంటుంది. అప్‌గ్రేడ్ అయిన యూపీ స్కూళ్ల టీచర్లకు ఇదే ప్రధాన సమస్యగా మారింది. ఇక్కడ డీడీఓ మారడంతో ఏ ఒక్కరికీ జీతభత్యాలు అందలేదు. పొజిషన్ ఐడీలు మండల స్థాయిలో నిర్ధారించి, జిల్లాకు.. ఇక్కడి నిర్ధారించి రాష్ట్రానికి పంపాల్సింది పోయి, నేరుగా రాష్ట్ర స్థాయిలో కేటాయించే చర్యలు చేపట్టడంతో సమస్య ఉత్పన్నమవుతోందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు. రాష్ట్రస్థాయిలో స్పష్టత రాక తిరిగి జిల్లా నుంచి 8 నుంచి 10 మంది సాంకేతిక నిపుణులను పిలిపించి వారం రోజులకు పైగా సరి చేయాల్సి వచ్చింది.

పిల్లల ఫీజులు, బ్యాంకులోన్ల కంతులకు అగచాట్లు..

కీలకమైన జూన్ నెలకు సంబంధించిన వేతనాలు రాకపోయేసరికి చాలామంది టీచర్లు పిల్లల చదువులకు ఫీజులు, బ్యాంకు లోన్ల కంతులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేయాల్సి వస్తోందంటూ వాపోతున్నారు. వారం రోజులు గడిస్తే జూలై జీతం రావాల్సి ఉందని, రెన్నెళ్ల జీతమైనా ఆగస్టులో వచ్చేలా అధికారులు చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



ఎస్పీ రత్నకు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: దళిత విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మడకశిర పర్యటనకు వచ్చిన ఎస్పీ రత్నను వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, దండోరా నాయకుడు గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథ్, సికిందర్ తదితరులు కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందని, దళితుల సమస్యలపై హోంమంత్రికివినతి పత్రం ఇవ్వడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. దళిత మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న లైంగిక దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

26 నుంచి 'హనుమాన్ దర్శన్'

- ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు



హనుమాన్ దర్శన్ యాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్టీసీ అధికారులు

పుట్టపర్తి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లాలోని మురడి, నేమకల్లు, కసాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలను ఒకే రోజు సందర్శించుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ సోమవారం వెల్లడించారు. ఈ నెల 26 నుంచి ప్రతి శని, మంగళవారాల్లో హనుమాన్ దర్శన్ పేరుతో జిల్లాలోని అన్ని డిపోల నుంచి బస్సులు బయలుదేరుతాయి. ఈ నెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19 బస్సులు బయలుదేరుతాయి. రద్దీకి అనుగుణంగా 50 మంది ఒకే బ్యాచ్‌గా ప్రయాణించాలనుకుంటే వారి ప్రాంతానికే ప్రత్యేకంగా బస్సును పంపిస్తారు. పూర్తి వివరాలకు ధర్మవరం (99592 25859), హిందూపురం (99592 25858), కదిరి (99592 25860), మడకశిర (99592 25865), పెనుకొండ (99592 29966), పుట్టపర్తి (99592 25857) డిపో మేనేజర్లను సంప్రదించవచ్చు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



అర్ధనగ్న ప్రదర్శనతో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పుట్టపర్తి టౌన్: సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి తొమ్మిదవ రోజుకు చేరింది. సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శనతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పుట్టపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి నాగార్జున, ట్రెజరర్ గోవిందు, సహాయ కార్యదర్శి పెద్దన్న, రామయ్య, కార్మికులు నరసింహులు, వెంకటేష్, రామాంజనమ్మ, సరోజమ్మ, వెంకటలక్ష్మి, నారాయణమ్మ, మారెప్ప, రమణ, సద్దాం, రామాంజినాయక్, సాయినాథరెడ్డి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 58 వినతులు



అర్జీ దారులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 58 వినతులు అందాయి. ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ హేమంత్‌కుమార్ వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసినా కేసు నమోదు చేయలేదు..

తన పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, రాగి వైర్ అపహరించారని, ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదంటూ డీఎస్పీ హేమంత్‌కుమార్ ఎదుట గోరంట్లకు చెందిన రైతు మురళి వాపోయాడు. జూన్ 29 రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారని తెలిపారు. అదే నెల 30న గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదని, ఇదేమని అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన దుండగులు దొరికితే కేసు నమోదు చేస్తామని సీఐ రాజశేఖర్ అంటున్నారని వాపోయాడు. ఎఫ్‌ఐఆర్ నకలు ఇస్తే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు కేటాయిస్తామంటున్నారని, లేకుంటే రూ.80 వేలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎఫ్‌ఐఆర్ కాపీ ఇప్పించి, తన సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నాడు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- కలెక్టర్ టీఎస్ చేతన్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రశాంతి నిలయం: పచ్చిరొట్ట ఎరువు వాడకంతో నేల సారవంతం అవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. పచ్చిరొట్ట పైర్ల వినియోగంపై వ్యవసాయ శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖ డీడీ చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప

మడకశిర: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప సూచించారు. సోమవారం మడకశిరలోని బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన కిట్లను పరిశీలించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆ దిశగా విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

రికార్డు అసిస్టెంట్‌కు నివాళి..

విద్యాశాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న అక్కంపల్లి గొట్టహట్టి గ్రామానికి చెందిన చిత్ర లింగప్ప సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకుని డీఈఓ క్రిష్టప్ప ఆ గ్రామానికి చేరుకుని చిత్రలింగప్ప మృతదేహానికి నివాళులర్పించారు. స్థానిక ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి ఆయన వెంట ఉన్నారు.

జల్సాలకు అలవాటు పడి బైకుల చోరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస రావు

అనంతపురం: జల్సాలకు అలవాటు పడి బైకులను చోరీ చేస్తున్న నలుగురు మైనర్లతో పాటు ముగ్గురిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు... ఆకుతోటపల్లికి చెందిన బైనేని యతీంద్ర అలియాస్ శివా, బోగిశెట్టి యోగీశ్వర్ అలియాస్ యోగి, అనంతపురంలోని గంగానగర్‌కు చెందిన సి. యశ్వంత్ కుమార్ అలియాస్ బన్నీ జల్సాలకు అలవాటు పడ్డారు. మరో నలుగురు మైనర్లతో కలిసి ఓ ముఠాగా ఏర్పడి బైకులను చోరీ చేయడం ప్రారంభించారు. శనివారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వైపు నుంచి లగేజీ ఆటోలో ఈ ఏడుగురు అనుమానాస్పదంగా వెళ్తుండడం చూసిన కొందరు.. సమాచారం ఇవ్వడంతో టూ టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ రుష్యేంద్ర బాబు, సిబ్బందితో అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. విచారిస్తే బాగోతం బయటపడింది. అనంతపురం నగరంతో పాటు ధర్మవరం, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో రెండేళ్లుగా బైక్‌లను చోరీ చేస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. వారి నుంచి 19 బైక్‌లు, ఒక లగేజీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.19 లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బైనేని యతేంద్ర అలియాస్ శివా ముఠాలో ముఖ్యుడని, ఇతనిపై ఇది వరకే 8 బైక్ చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

అలరించిన నృత్య రూపకం



నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన మిడిల్ ఈస్ట్, గల్ఫ్ దేశాలకు చెందిన బాలవికాస్ చిన్నారులు సోమవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత సంగీత నృత్య రూపకం నిర్వహించారు. అబుదాబి, దుబాయ్, ఓమన్, కువైట్, ఖతార్ దేశాలకు చెందిన చిన్నారులు పాల్గొన్నారు.

గడువులోపు పనులన్నీ పూర్తి కావాలి

- పంచాయతీరాజ్ సీఈ అశోక్‌కుమార్
- ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏపీఆర్‌ఆర్‌పీ రోడ్ల పురోగతిపై సమీక్ష
- హాజరైన ఉమ్మడి జిల్లాల పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు



మాట్లాడుతున్న సీఈ అశోక్‌కుమార్. చిత్రంలో ఎస్‌ఈ ప్రభాకర్‌రెడ్డి, అధికారులు

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్ (ఏపీఆర్‌ఆర్‌పీ) కింద మంజూరైన పనులన్నీ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని సంబంధిత అధికారులను ఆ విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఈ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏపీఆర్‌ఆర్‌పీ రోడ్ల పురోగతిపై సీఈ కార్యాలయ ఈఈ రమణమూర్తితో కలసి అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో అనంతపురంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. అనంతపురం సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, పీపీ రాజేంద్ర ప్రసాద్, పీఐయూ ఈఈ నవీన్‌కుమార్, ఈఈలు శంకరయ్య, రఘునాథరెడ్డి, డీఈఈలు, ఏఈఈలు హాజరయ్యారు. నాలుగేళ్లలో అనంతపురం జిల్లాకు సంబంధించి రూ.209 కోట్లతో 138 రోడ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 52 పనులు పూర్తయ్యాయని, 42 పనులు ప్రోగ్రెస్‌లో ఉండగా, 44 పనులు రద్దయినట్లు ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. మొత్తం రూ.101 కోట్లు ఖర్చు పెట్టి 195.71 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించినట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాకు రూ.230 కోట్లతో 194 పనులు మంజూరు కాగా, 119 పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు వివరించారు. 28 పనులు వివిధ దశల్లో ఉండగా, 47 పనులు రద్దయ్యాయని తెలిపారు. మొత్తం 193.91 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరిస్థితిపైనా ఆయన సమీక్షించారు. గడువులోపు పనులన్నీ పూర్తి నాణ్యతగా చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు గంగాధరప్ప

పరిగి: స్థానిక జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం వడ్డిపల్లికి చెందిన చిన్నకొండప్ప గారి గంగాధరప్ప (41) బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం తన భార్య సునందమ్మతో కలసి కర్ణాటకలోని పావగడ తాలూకా అచ్చంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అక్కడ భార్యను పుట్టింట్లో వదిలి అదే రోజు రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. పరిగి మండలం ధనాపురం క్రాస్ సమీపంలో ప్రయాణిస్తుండగా రాత్రి 9 గంటల సమయంలో నియంత్రణ కోల్పోయి జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన గంగాధరప్పను అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బంధువులు బెంగళూరుకు తీసుకెళుతుండగా సోమవారం వేకువజామున మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జెడ్పీ ఉద్యోగి ఆకస్మిక మృతి



శివనారాయణరెడ్డి (ఫైల్)

అనంతపురం సిటీ: స్థానిక హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న జెడ్పీ ఉద్యోగి శివనారాయణరెడ్డి(56) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక తుదిశ్వాస వదిలినట్లు వివరించారు. మొన్నటి వరకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేసిన శివనారాయణరెడ్డి.. ఇటీవల బదిలీపై పెనుకొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న జెడ్పీ ఉద్యోగులు పలువురు ఇంటికి వెళ్లి శివనారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు సంతాపం తెలిపారు.

శనీశ్వరాలయం.. స్వర్ణమయం



బంగారు రేకులతో గర్భగుడికి తాపడం చేసిన దృశ్యం

పావగడ: స్థానిక శనీశ్వరాలయం స్వర్ణ దేవాలయంగా మారింది. ఆలయంలో శనీశ్వరస్వామి కొలువు తీరిన గర్భగుడిని బంగారు రేకులతో తాపడం చేశారు. సుమారు 8 కిలోల బంగారంతో చేపట్టిన ఈ పనిని బిహార్ నుంచి వచ్చిన స్వర్ణకారులు విజయవంతంగా పూర్తి చేశారు. పలచని బంగారు రేకును గర్భగుడికి అమర్చడంతో భక్తులు పరవశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. గణపతి పూజ, హోమాలు నిర్వహించారు.

ఖరీఫ్ సాగు.. డీలా



నాడు : పెదపల్లి వద్ద వేరుశనగ పొలంలో పని చేస్తున్న కూలీలు



నేడు : అదే భూమి బీడుగా దర్శనమిస్తున్న దృశ్యం

- రెండు లక్షల హెక్టార్లు బీడు
- వర్షాభావంతో సన్నగిల్లిన ఆశలు
- పశువులకు మేత కూడా గగనమే

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల సాగుపై ఆశలు వదులుకున్నారు. ఇప్పటికే మంచి అదను మించిపోవడంతో వేరుశనగ, కంది సాగు చేసే పరిస్థితి లేదు. బోర్లు ఉన్న రైతులు మాత్రమే సాగు చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పశువులు, జీవాలకు మేత దొరకడం కూడా కష్టంగా మారింది. గత ఐదేళ్ల సాగు గణాంకాలు పరిశీలిస్తే ఏటా సాధారణంగా 2,19,950 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాదిలో ఈ నెల ఐదో తేదీ వరకు వరకు ,15,333 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో వేరుశనగ 10,365 హెక్టార్లు, మొక్కజొన్న 1,696, కంది 1,614, పత్తి 1,208, రాగి 267, ఆముదం 53, వరి 54, సజ్జ 50, జొన్న 26 హెక్టార్లలో వేశారు. మొదటి తర్వాత నుంచి జల్లులు కురుస్తున్నా ఉపయోగం లేకుండా పోతోంది. దీంతో రెండు లక్షల హెక్టార్లకు పైగా భూమి బీడుగా పెట్టారు. ఇలా అయితే వ్యవసాయం చేసేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

